ముగిసిన పట్టభద్రుల ఎన్నికలు

- డివిజన్‌లో 74.06 శాతం ఓటింగ్
- అత్యధికంగా రేపల్లె మండలంలో 88.81 శాతం
- అత్యల్పంగా నగరంలో 69.25 శాతం




రేపల్లెలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

రేపల్లె రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని ప్రకాశం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐదు పోలింగ్ కేంద్రాలలో గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ కార్యక్రమం జరిగింది. ఉదయం 2 గంటల పాటు పోలింగ్ సరళి నెమ్మదిగా సాగినా 10 గంటల నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. 10 గంటల నుంచి 12 గంటల మధ్యలో పోలింగ్ కేంద్రాలు ఓటర్లతో బారులు తీరి కనిపించాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు తాగునీరు, ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆర్డీవో నేలపు రామలక్ష్మి పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ సరళిని ఎప్పటికప్పుడు పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్‌లో 17,730 మంది ఓటర్లు ఉండగా 13,131 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. 74.06 శాతం పోలింగ్ నమోదయ్యిందన్నారు. డివిజన్‌లోని రేపల్లె మండలంలో అత్యధికంగా 88.81 శాతం నమోదైందన్నారు. అత్యల్పంగా నగరం మండలంలో 69.25 శాతం ఓటింగ్ అయి నమోదయ్యిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు పర్యవేక్షణలో పట్టణ సీఐ మల్లికార్జునరావు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

చెరుకుపల్లిలో 74.34 శాతం పోలింగ్

చెరుకుపల్లి: గుళ్ళపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉమ్మడి గుంటూరు–కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగింది. పాఠశాలలో మూడు బూతులు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభం అయిన పోలింగ్ మొదట కొంత నిదానంగా జరిగినా 10 గంటల నుంచి ఓటర్లు పెద్ద ఎత్తున ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 2,035 ఓట్లకు గాను 1,513 మంది ఓటు హక్కు వినియోగించుకున్నరు. దీంతో పోలింగ్ ముగిసే సమయానికి 74.34 శాతం ఓట్లు పోలైనట్లు తహసీల్దార్ సీహెచ్ పద్మావతి తెలిపారు. పోలింగ్ జరిగే సమయంలో ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లు వేర్వేరు సమయాల్లో వచ్చి పోలింగ్ జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్, ఆయన సతీమణి డాక్టర్ కేశవతి ఇద్దరు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తహసీల్దార్ పర్యవేక్షణలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

వేమూరు నియోజకవర్గంలో 75.2 శాతం పోలింగ్ నమోదు

వేమూరు: వేమూరు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో 75.2 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి తహసీల్దారు సుశీల తెలిపారు. వేమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొల్లూరు బాలురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రెండు పోలింగ్ కేంద్రాలు, అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు, చుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రెండు, భట్టిప్రోలు టీఎంఆర్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 8,651 ఓట్లకు గాను 6,493 ఓట్లు పోలైనట్లు ఆమె తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 75.2 శాతం ఓట్లు పోలయ్యాయన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. ఓటర్లు క్యూలైనలో నిలిచి ఓటు హక్కు వినియోగించుకోవడం జరిగిందని తహసీల్దారు తెలిపారు.



ఓటు హక్కు వినియోగించుకున్న డాక్టర్ గణేష్ దంపతులు

డివిజన్ ఓటింగ్ ఇలా...

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
రేపల్లె పట్టణం	3,340	2,412	72.22
రేపల్లె మండలం	554	492	88.81
చెరుకుపల్లి	2,035	1,513	74.34
నగరం	1,574	1,090	69.25
నిజాంపట్నం	1,576	1,131	77.76
చుండూరు	1,617	1,194	73.84
అమర్తలూరు	1,580	1,265	80.06
వేమూరు	1,663	1,252	75.28
కొల్లూరు	1,809	1,328	73.21
భట్టిప్రోలు	1,982	1,454	73.36
మొత్తం	17,730	13,131	74.06

కొల్లూరులో 73.41 శాతం పోలింగ్



కొల్లూరులోని పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు

కొల్లూరు : కొల్లూరులో జరిగిన పటభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 73.41 శాతం ఓట్లు పోలయినట్లు అధికారులు ప్రకటించారు. మండలంలో మొత్తం 1,809 మంది ఓటర్లు ఉండగా, 1,328 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 395 బూత్‌లో 697 మంది మొత్తం ఓటు హక్కు వినియోగించుకోగా, తొలుత పోలింగ్ ప్రక్రియ మందకొడిగా సాగడంతో 4 గంటలకు ముగియాల్సిన సమయంలో ఓటర్లు బారులు తీరి ఉండటంతో సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. 396 పోలింగ్ బూత్‌లో మొత్తం 631 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ మొదటి రెండు గంటల పాటు మందకొడిగా సాగినప్పటికీ 10 గంటల నుంచి ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారు. పోలింగ్ ప్రక్రియలో పీఓలుగా సత్యనారాయణ, శేషుగోపాలం వ్యవహరించారు. పోలింగ్ ప్రక్రియను కొల్లూరు తహశీల్దార్ బి.వెంకటేశ్వర్లు, వేమూరు సీఐ పి.వీరాంజనేయులు, కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు పర్యవేక్షించారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ తుషార్ డూడీ



పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి

వేమూరు: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికల పోలింగ్‌ను ఆయన గురువారం పరిశీలించారు. నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు బలగాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు గొడవలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేయాలని ఆయన పోలీసులకు సూచించారు. బాపట్ల జిల్లాలోని వేమూరు, రేపల్లె, బాపట్ల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుశీల, సీఐ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా మల్లికార్జున స్వామి గ్రామోత్సవం



నగరం: మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం నగరం పురవీధులలో గంగాంబిక సమేత మల్లికార్జునస్వామి వారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంపై ఉంచి కనుల పండువగా గ్రామోత్సవం చేశారు. దారి పొడవునా భక్తులు స్వామి వారికి తమ శక్తి కొలది పూజా సామగ్రి అందించారు. శివరాత్రి రోజున స్వామి వారి కల్యాణోత్సవాన్ని జరిపి మరుసటి రోజున గ్రామోత్సవం చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నగరంలో 69.25 పోలింగ్ శాతం నమోదు



నగరం: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలలో 69.25 శాతం ఓటింగ్ జరిగినట్లు తహసీల్దార్ నాంచారయ్య తెలిపారు. మండలంలో 1,574 మంది ఓటర్లు ఉండగా 1,090 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని తహసీల్దార్ నాంచారయ్య పర్యవేక్షించారు.

కర్లపాలెంలో 78 శాతం పోలింగ్ నమోదు



కర్లపాలెం: గురువారం జరిగిన కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలలో కర్లపాలెం మండలంలో 78 శాతం పోలింగ్ జరిగింది. కర్లపాలెం ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 1,169 ఓట్లు ఉండగా 910 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, డీఎస్పీ రామాంజనేయులు సందర్శించారు. పోలింగ్ కేంద్రం వద్ద కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

పిట్టలవానిపాలెంలో...

మండలంలో 72 శాతం పోలింగ్ జరిగింది. 411 పోలింగ్ బూత్‌లో 600 ఓట్లకు గాను 427 ఓట్లు, 411ఏ పోలింగ్ బూత్‌లో 617 ఓట్లకు గాను 446 ఓట్లు పోలయ్యాయి.

అభియోగాలు లేకుండా పదవీ విరమణ అదృష్టం



లక్ష్మీపురం: ప్రభుత్వ ఉద్యోగులు తప్పులు, అభియోగాలు లేకుండా ఉద్యోగ విరమణ చేయడం అదృష్టంగా భావించాలని సెంట్రల్ ట్యాక్స్, కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. కన్నవారితోటలోని జీఎస్టీ భవన్‌లో సూపరింటెండెంట్ పోగుల ఆషా ఉద్యోగ విరమణ సభ గురువారం నిర్వహించారు. కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో తెలిసో తెలియక చేసిన తప్పులు వల్ల పలు శాఖల్లోని ఉద్యోగులు విజిలెన్స్ కేసులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అవి పరిష్కారం అయ్యేసరికి పదవీ కాలం కూడా ముగుస్తుందన్నారు. కొన్ని కేసులు రిటైర్మెంట్ తర్వాత కూడా వేధిస్తాయని, పెన్షన్ లో కూడా ఇబ్బందులు తలెత్తుతాయని వివరించారు. ఉద్యోగులందరూ విధినిర్వహణలో ఎలాంటి అభియోగాలు, అభ్యంతరాలు, ఆరోపణలు, లోపాలు లేకుండా పనిచేయాలని సూచించారు. పదవీ విరమణ చేస్తున్న ఆషా తన సర్వీసులో ఎటువంటి మచ్చ లేకుండా, పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేశారని కమిషనర్ కొనియాడారు. అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆషా ఎన్నోసార్లు రక్తదానం చేశారని, అవయవ దానం చేయడానికి కూడా ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం ఆషా, నాగశంకర్ దంపతులను కమిషనర్ సాధు నరసింహారెడ్డి ఆయన సతీమణి, కేంద్ర ప్రభుత్వ శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు సాధు కావ్య, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్లు వి.వి.రావు, నాగరాజు, రవికుమార్, మనోజ్ కుమార్, రాయలు, సీతారామరాజు సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, చీదెళ్ల ఈశ్వరరావు, చిట్టే వెంకట్, పెన్షనర్ల సంఘ నాయకులు రాజేశ్వరరావు, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.వి.సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు, సామ్రాజ్యం పాల్గొన్నారు.

నిషేధానికి ముందే వలసలు

- సాయం కోసం ఎదురుచూసినా ఫలితం శూన్యం
- నియోజకవర్గంలో దాదాపు 5,000 మంది మత్స్యకారులకు ఉపాధి కరువు




తీరంలో నిలిపి ఉంచిన పడవలు

బాపట్ల : వేట నిషేధం కంటే ముందే మత్స్యకారులు వలస బాటపట్టారు. వేట నిషేధం సమయంలో ప్రభుత్వం అందించాల్సిన సాయం మళ్లీ నిషేధం సమీపిస్తున్నప్పటికీ వాటి గురించి పట్టించుకునే నాథుడే కనిపించలేదు. బాపట్ల నియోజకవర్గ పరిధిలో సుమారు 5,000 మంది వేట నిషేధ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి ఏటా వేట నిషేధానికి సంబంధించి మత్స్యకారులకు రూ.10 వేలు వారి ఖాతాల్లో జమ చేసేవారు. ఈ ఏడాది మత్స్యకారుల గురించి పట్టించుకునే నాథుడే కనిపించలేదు. దీంతో ఈ ఏడాది ఎక్కువ మంది వలసలు వెళుతున్నారు.

ఏప్రిల్ 15 నంచి మే 31 వరకు వేట నిషేధం

రాష్ట్రంలో ఏటా ఏప్రిల్ 15 నంచి మే 31 వరకు వేట నిషేధం ఉంటంతో పలు రాష్ట్రాలకు వేట చేసేందుకు ఈ ప్రాంతం వారు వెళుతుంటారు. ఈ ఏడాది ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని మత్స్యకారులు చెబుతున్నారు. బెంగుళూరు, గోవా వెళ్లేందుకు మత్స్యకారులు సిద్ధమవుతున్నారు. ఏప్రిల్ 15 నుంచి మే 31 వరకు సముద్ర జీవరాసుల గుడ్లు ఉత్పత్తి దశ కావటంతో వేట నిషేధం విధిస్తారు. తరువాత జూన్ ఒకటో తేదీ నుంచి మరలా వేటకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. సాధారణంగా ఈ ప్రాంతంలో వేట నిషేధ సమయంలో ఇతర రాష్ట్రాలకు వేట కోసం వెళ్లే మత్స్యకారులు ఈ ఏడాది నెల రోజుల ముందే వలసలకు సిద్ధమవుతున్నారు.

వేట కోసం ఇతర రాష్ట్రాలకు

రాష్ట్రంలో మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఉపాధి కోసం బెంగుళూరు, గోవా ప్రాంతాల్లో వేటకు వెళుతుంటారు. అలా వేటకు వెళ్లిన సందర్భంలో మత్స్యకారుల గ్రామాల్లో మహిళలు మినహా మిగిలిన వారందరూ వేటకు వెళ్తారు. వేట నిషేధానికి ముందుగా రెండు నెలలు కలుపుకుని మొత్తం నాలుగు నెలల పాటు ఇతర రాష్ట్రాల్లో ఉండిపోతున్నారు.

ఇతర రాష్ట్రాలకు వేటకు వెళ్ళే గ్రామాలు ఇవి

బాపట్ల నియోజకవర్గంలోనే ఎక్కువ తీరప్రాంతం ఉంది. నియోజకవర్గంలో ఎనిమిది వేల మంది మత్స్యకారులు జీవనం సాగిస్తుంటారు. ఈ నియోజకవర్గంలోని అడవిపల్లిపాలెం, దాన్వాయ్‌పేట, కృపానగర్, రామచంద్రపురం, పాండురంగాపురం, సూర్యలంక, రామానగర్, ముత్తాయిపాలెం, హనుమాన్‌నగర్ వంటి గ్రామాల్లో సుమారు ఐదు వేల మందికిపైగా మత్స్యకారులు జీవనం సాగిస్తుంటారు. వీరిలో ఎక్కువ శాతం మత్స్యకారులు ఇతర రాష్ట్రాలకు వేటకు వెళుతుంటారు.

ప్రభుత్వం సాయం చేయలేదు



మత్స్యకారులను గత ప్రభుత్వం ఆదుకుంది. గతంలో వేట నిషేధానికి సంబంధించిన భత్యం కూడా ఈ పాటికే అందించటం జరిగింది. ఈ ప్రభుత్వం మత్స్యకారులను పట్టించుకోలేదు. రేపల్లె ప్రాంతంలో ఉన్న సబ్సిడీ డీజిల్‌ను కూడా వైఎస్సార్‌సీపీ అందించి బాపట్లకు మేలు చేసింది. అయితే ఈ ప్రభుత్వం మత్స్యకారులను పట్టించుకోకపోవటంతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

–కొక్కిలిగడ్డ చెంచయ్య, మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

బాపట్ల మత్స్యకారులకు డిమాండ్



బాపట్ల ప్రాంతానికి చెందిన మత్స్యకారులకు ఎంతో డిమాండ్ ఉంటుంది. మన రాష్ట్రంలో వేట నిషేధం సమయంలో ఇతర రాష్ట్రాలకు వేట నిమిత్తం వెళ్లటం జరుగుతుంది. ఈ నెలాఖారు నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నాం.

–బాలచంద్ర, మత్స్యకారుడు

అందరికీ మహాశివుని ఆశీస్సులు ఉండాలి



తెనాలిటౌన్: మహాశివరాత్రి పర్వదినాన పరమ శివుని ఆశీస్సులు అందరిపై మెండుగా ఉండాలని దుగ్గిరాల మాజీ ఎంపీపీ వెనిగళ్ళ కృష్ణ ప్రసాద్ ఆకాక్షించారు. రూరల్ మండలం ఖాజీపేట గ్రామంలో వేంచేసియున్న శ్రీకాశీ విశాలాక్షి సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. గురువారం ఏర్పాటు చేసిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా వెనిగళ్ళ కృష్ణప్రసాద్ పాల్గొని పేద వృద్ధులకు కొత్త వస్త్రాలు అందజేశారు. విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. దేవాలయాభివృద్ధికి ధర్మకర్త రాచర్ల సాంబయ్య చేస్తున్న కృషి మరువలేనిదని కొనియాడారు. వసుదైక కుటుంబం ఖాజీపేట వారిచే నిర్వహించిన కోలాట ప్రదర్శన, జెడ్పీ హెచ్‌స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం రేమిణిశెట్టి దుర్గాప్రసాద్ సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామంలో ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు కొండ కావూరి నాగలింగశర్మ, రాచర్ల వెంకటసత్యనారాయణ, శనగపల్లి వెంకటేశ్వరరావు, తాళ్ళ సీతారామిరెడ్డి, పొత్తూరి నాగేశ్వరరావు, రెడ్డి శివరామకృష్ణ, అంకిరెడ్డి సీతారామయ్య, పోతాబత్తుని మోహనరావు, కాలిశెట్టి గాయత్రీదేవి, పసుపులేటి వెంకట్రావు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫౌండేషన్ ప్రతినిధులు

గుంటూరు రూరల్: మండలంలోని అడవితక్కెళ్లపాడులో గల అంబేద్కర్ రెసిడెన్షియల్ బాలుర వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్(సత్తెనపల్లి) ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ నిర్వహించారు. కార్యక్రమాన్ని మోస్‌టెక్స్ పెన్స్ కంపెనీ ఆంధ్రప్రదేశ్ సేల్స్ మేనేజర్ యూకే రాజు, సేల్స్ ఎగ్జిక్యూటివ్ విజయ్‌భాస్కర్ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా కుగ్లర్ మెమోరియల్ ఫిజియోథెరపీ కాలేజీ (గుంటూరు) కస్పాండెంట్ కర్ర హానోక్ బెంజిమెన్ మాట్లాడుతూ విజయాలను సాధించిన ప్రతి ఒక్కరు సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్లే సాధ్యమైందని తెలిపారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి మార్కులు సాధించాలని చెప్పారు. క్రమశిక్షణ, మంచి ఆలోచన విధానంతో ఇంటర్మీడియట్ దశను దాటిన వారే జీవితంలో మంచి భవిష్యత్తును అందుకోగలరని సూచించారు. స్కాలర్స్ ఆర్ ఆర్ బీ కోచింగ్ డైరెక్టర్ టి. ఇమ్మానుయేల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని, వ్యక్తిని సమర్థ ప్రగతిశీల వనరుగా తీర్చిదిద్దేది కేవలం చదువు మాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కొండారెడ్డి, ఐఐటీ నీట్ అకాడమీ డైరెక్టర్ ఆనంద్‌బాబు, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, శ్రీలక్ష్మి, ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు నాగభూషణం విశ్వేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయండి



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ గురువారం సందర్శించి, కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది కోట్ల రూపాయలు విలువ చేసే సిమెంట్ ఫ్యాక్టరీ భూములు ఉన్నా కార్మికులకు బకాయిలు మాత్రం యాజమాన్యం చెల్లించకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా మంత్రి నారాలోకేష్ ఎన్నికల ముందుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. యహోషువా, మాణిక్యరావు, బాష, అగ్గయ్య, దానయ్య, శివకుమారి, సారమ్మ, రిబ్కా పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

నేడు భారీ అన్న సంతర్పణ



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి పోలకంపాడులో వేంచేసియున్న పోలకమ్మతల్లి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు వంగ దేవ గురువారం తెలిపారు. పోలకంపాడులోని పోలకమ్మ తల్లిదేవాలయ 17వ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం నుంచి 11 గంటల వరకు అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ఆమె కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంత ప్రభాకర్, తోక సత్యనారాయణ, గంగాధర్, కొండలరావు, బత్తుల నాగబాబు, బత్తుల ప్రభుదాసు, వంగ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తక్షణమే జాబ్ కేలండర్ ప్రకటించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వశాఖల్లో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కృష్ణా–గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుమ్మా శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొన్నూరు రోడ్డులోని తన కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ప్రకటించి, ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో పారదర్శకత చూపించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేసి, నిరుద్యోగుల ఆశలు వమ్ము కానీయకుండా చర్యలు చేపట్టాలని కోరారు. నిరుద్యోగుల జీవితాలను బాగు చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం పని చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్పష్టమైన ఆలోచన, ప్రణాళికతో 11 అంశాలను మేనిఫెస్టోలో చేర్చానని చెప్పారు. గురువారం జరిగిన ఎన్నికల్లో తనకు ఓటు వేసిన గ్రాడ్యుయేట్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.